# నా చేతికి వాచీ లేదు

**- కోలపల్లి ఈశ్వర్**

ముందు గదిలో ఫోన్ మోగుతోంది. పేపరు పక్కన పడేసి వెళ్లి ఫోన్ ఎత్తాడు రాంమోహన్. అటునుంచి ఎవరూ మాట్లాడ్డంలేదు.

'హలో... హలో' అంటూ నాలుగుసార్లు అరచి ఫోన్ పెట్టేసి వెళ్లి మళ్ళీ పేపరందుకున్నాడు.

'పట్టపగలు ఆగంతకుడి ఆగడం, ఇరవై వేల చోరీ' వార్త వెంట అతడి కంటి చూపు పరుగెడుతోంది. రెండు వాక్యాలు చదివాడో లేదో మళ్లీ ఫోన్.

ఈసారి కూడా అంతే. పళ్ళు బిగబట్టి ఫోన్ పడేసినంత పనిచేసి వెనక్కి తిరగబోతుంటే ఇంటి ఎదురుగా ఒక మనిషి చటుక్కున మాయమవడం కనిపించింది. బయటకు వచ్చి చూస్తే ఎవరూ కనిపించలేదు.

ఆలోచిస్తూ వెళ్లి పేపరు తీసుకుని కూర్చున్నాడు. అతడు ఆ వార్తను చదవలేకపోతున్నాడు. పేపరుపై నుండి కళ్లెత్తి గుమ్మం బయటకు చూసాడు రాంమోహన్.

నలభై ఏళ్ళ వ్యక్తి మాసిన ప్యాంటు, షర్టూ వేసుకుని వున్నాడు. బాగా పెరిగిన జుట్టు, మొహంపై మచ్చలు, మెల్లగా గుమ్మం ముందు నుండి కదులుతూ ఎడమ కన్నెత్తి ఇంట్లోకి చూస్తున్నాడు. కొద్దిక్షణాల తరువాత అటునుండి అదే పద్ధతిలో ఇటువైపు వెళ్లాడు.

కళ్ళు మరల్చి పేపరులోకి చూసాడు రాంమోహన్. 'దంపతుల దారుణ హత్య, బంగారంతో దొంగ పరారు' మరో వార్త. రాంమోహన్ గుండె వేగంగా కొట్టుకుంటోంది. లోపలకు చూసాడు. అతని భార్య లలిత ఒళ్లెరుగకుండా నిద్రపోతోంది.

ఈ కాలనీలో ఇళ్ళు చాలా తక్కువే కాకుండా దూరం దూరంగా వున్నాయి. వేరే మంచి ఇళ్ళు ఎక్కడా దొరక్క ఈ ఇల్లు అద్దెకు తీసుకున్నారుగానీ తీసుకున్నప్పటినుంచీ అతనికి భయంగానే వుంది.

మళ్ళీ ఫోన్ మోగింది. ఈసారి వళ్ళు ఝల్లుమంది రాంమోహన్‌కు. ఫోన్ అందుకుని చెవికానించి బయటకు చూసాడు. తల కదల్చకుండా కనుకొసలలోంచి ఇంటి లోపలివైపుకు చూస్తూ అదే మనిషి. మెల్లగా కదలి వెళ్తున్నాడు అటువైపు.

ఫోన్‌లో అటునుంచి శబ్దం అనేదేలేదు.

''హలో...ఎవరు? ఎవరది? ఎందుకు ఫోన్ చేస్తున్నావు? ఎవర్నువ్వు? నిన్నే... హలో...హలో!''

లాభంలేదు. అవతలివైపు ఫోన్ పెట్టేయకుండా వింటున్నారని అర్థమైంది రాంమోహన్‌కి. మళ్లీ ఒక అనుమానం. వింటున్నారని ఎలా అనుకునేది? ఊరికే రింగ్ చేసి ఫోన్ పక్కన పెట్టేస్తున్నారేమో!

రాంమోహన్‌కు కొంచెం భయం ఎక్కువే. కారణం అతని వీక్ పర్సనాలిటీ. శరీర దారుఢ్యం మామూలు కన్నా తక్కువే. సన్నగా వుంటాడు.

గుమ్మం బయట ఆ వైపునుండి ఈవైపు వెళ్తున్నాడా ఆగంతకుడు మళ్ళీ. అతడి కళ్ళు సూటిగా చూస్తున్నాయి లోపలివైపు.

అది రెండు గదులు. ఒక వంట గది కలిగిన పోర్షన్. ఇల్లు కొంచెం ఎత్తులో కట్టారు కాబట్టి మెట్లు ఎక్కువున్నాయి. లోపల బెడ్‌మీద పడుకున్న లలిత కొంచెం కదిలి ఇటు తిరిగి పడుకుంది. ఆమె ఇప్పుడు గుమ్మంలో వున్నవారికి స్పష్టంగా కనిపిస్తుంది.

రాంమోహన్‌కు ఈమధ్యే పెళ్లయింది. పెళ్లి కాగానే ఏవో ఇంటిగొడవల కారణంగా అందరికీ దూరంగా ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు.

ఈ రోజు ఆదివారం. కాలనీలో ప్రతిరోజూ ఇలాగే వుంటుంది. ఒక ఇంట్లో ఏం జరిగేదీ అవతల ఇంటి వాడికి అస్సలు తెలియదు. తెలియకపోతేనే మంచిది. ఎందుకంటే తెలిస్తే అటువైపు అస్సలు రారు భయంతో.

ఇప్పుడు ఏం జరుగుతోందో అర్థంకాని పరిస్థితి. ఈ రెస్పాన్స్‌లేని ఫోన్ ఏమిటో? ఎవరు ఎందుకు చేస్తున్నారో? ఇంటిముందు తచ్చాడుతున్న ఆ వెధవ ఎవడో? వాడు చూడ్డానికే భయంకరంగా వున్నాడు. చేతిలో ఏదైనా ఆయుధం వుందో ఏమిటో?

ముఖంపై చెమటలు పడుతున్నాయి. వెళ్లి ఫ్రిజ్‌లోంచి మంచినీళ్ళు తీసుకుని తాగాడు. లలితను లేపితే? ఛ...బావుండదు. తన భర్త ఇంత పిరికివాడా అనుకుంటుంది. పోనీ తన ఫ్రెండ్ ఎవర్నికైనా ఫోన్ చేసి పిలిస్తే? అవును...ఈ ఐడియా బావుంది. ఎవరున్నారు? తనకు ఇక్కడవున్న ఫ్రెండ్స్ చాలా తక్కువ. అందులో ఈ టైమ్‌లో ఫ్రీగా ఉండేది మహిపాల్ ఒక్కడే. ఏదో ఒక మిషమీద అతన్ని రమ్మంటే సరి.

ఫోన్ అందుకుని నెంబర్ డయల్ చేయసాగాడు. అదిగో మళ్లీ ఆగంతకుడు. ఈసారి ప్యాంటు జేబుల్లో చేతులు దూర్చి వెళుతున్నాడు. క్షణం ఆగి నిలబడి ఇంట్లోకి చూస్తూ అలాగే నిలబడ్డాడు. ఎంత తీక్షణంగా వుందా చూపు!

అంటే తను ఫోన్ చేస్తున్నందుకు అతడికి కోపం వచ్చిందా? ఇంతకూ అతడి ఉద్దేశ్యం ఏమిటో? ఇంకే ముంది? ఇంట్లో తను, తన భార్య తప్ప మూడో మనిషి లేరని గ్రహించాడు. అందుకే అటూ ఇటూ అలా కళ్లింత చేసుకుని గుచ్చి గుచ్చి చూస్తూ చక్కర్లు కొడ్తున్నాడు. ఇంకాసేపటి తరువాత డైరెక్టుగా లోనికి జొరబడి జేబులో నుండి ఏ కత్తో, పిస్టలో తీసి...

రాంమోహన్ చేతులు వణుకుతున్నాయి. గుండె కొట్టుకునే శబ్దం పిచ్చెక్కిస్తోంది.

''హలో...హలో'' అవతల్నుంచి ఆడ కంఠం.

గొంతు పెగుల్చుకుని ''ఊ...హ..హలో'' అన్నాడు రాంమోహన్.

''హలో...చెప్పండి హలో...''

''మ...మహిపాల్ వున్నాడా?''

''లేరండీ. మీరెవరు?''

''నే...నేనతని స్నేహితుడ్ని. ఎటు వెళ్లాడు?''

'మా వీధిలో ఇంతకుముందే దొంగలు పడితే ఆయనా, పక్కింటివాళ్ళు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. సరే...రాగానే చెబుతాను. మీ పేరు?''

''...''

''హలో...హలో...''

ఫోన్ పెట్టేసి కళ్ళు తిరుగుతుండగా గుమ్మం వైపు చూసాడు రాంమోహన్. ఆ వ్యక్తి గుమ్మానికి ఆరడుగుల దూరంలో తలను అటూ ఇటూ కదిలిస్తూ ఒక చేత్తో బుగ్గ గీరుకుంటూ అలా లోనికి చూస్తూనే వున్నాడు.

వెళ్లి తలుపులు వేసి లోపలినుంచి తాళం వేసుకోవాలి. అంతే! అంతే!

శక్తినంతా కూడదీసుకుని లుంగీ ఒక చేత పట్టుకుని అడుగులు తడబడుతుండగా గుమ్మంవైపు కదిలాడు రాంమోహన్. మెల్లగా... మెల్లగా గడప దగ్గరకు వచ్చి తలుపు పైన చేయి అలా వేశాడో లేదో...

ఉన్నట్టుండి అవతలి వ్యక్తి అతివేగంగా గుమ్మంవైపు కదిలాడు ఒక చేయి గాలిలోకి లేపుతూ.

అంతే! ఆ తరువాత ఏం జరిగిందో తెలియదు. బలంగా రెండు తలుపులనూ దగ్గరకు చేర్చే ప్రయత్నంలో పట్టుతప్పి తలుపుల మధ్యలోనుండి తూలి మెట్లపై నుండి జారి కిందపడిపోయాడు రాంమోహన్.

అంతవరకూ అతనికి గుర్తుంది.

కళ్ళు తెరిచేసరికి పక్కనే లలిత కనిపించింది. తను ఇంట్లో బెడ్‌పైన వున్నాడు. చేయి భారంగా వుంటే కళ్ళు తిప్పి చూసాడు. చేతికి బ్యాండేజీ ఉంది. జరిగింది గుర్తుకొచ్చింది.

''లలితా... ఏమైంది... దొంగ... దొంగ ఏడి?'' అని అడగసాగాడు తడబడుతున్న గొంతుతో.

నొసలు చిట్లించి చూస్తూ ''దొంగ ఏమిటండీ? దొంగ ఎవరూ రాలేదే? కలగంటున్నారా? జరిగింది గుర్తుందా? అసలు మెట్లవైపు ఎందుకు పరుగెత్తారు?'' అంటోంది లలిత.

''అదీ... దొంగ... బందిపోటు... వాడు... బయట... ఇంట్లోకి...'' ఎలా చెప్పాలో అర్థం కాలేదు రాంమోహన్‌కు.

''ఏమిటో? ఇదేం అలవాటో?'' గొణిగింది లలిత.

కళ్లు మూసుకుని భారంగా నిట్టూర్పు విడిచి కళ్ళు తెరిచి ''సారీ లలితా!'' అన్నాడు.

''ఏమిటండీ! అలా ఉన్నట్టుండి వెళ్లి చేయి విరగ్గొట్టుకున్నారు? సమయానికి ఆయనెవరో వచ్చి ఆదుకోకపోతే ఇంకేమై ఉండేదో?''

''ఎవరు?''

''ఏమో దేవుడిలా మీరు మెట్లమీద జారిపడిపోయినప్పుడు గుమ్మం బయట నుండి వెళ్తున్నాడుట. వెంటనే మిమ్మల్ని లేవదీసి నీళ్ళు త్రాగించి నన్ను నిద్ర లేపాడు. కంగారుపడవద్దనీ, తనే వెళ్లి డాక్టర్ని తీసుకుని వచ్చాడు. డాక్టరు వచ్చి మీకు బ్యాండేజీ వేసి ఇంజెక్షన్ చేసి వెళ్లాడు. గాయం చిన్నదే అని చెప్పాడు గానీ ఇప్పటికిగానీ మీరు స్పృహ రాలేదు. నాకెంత కంగారుగా వుందో? సమయానికి ఇక్కడెవరూ లేరు కదా. ఆయనే మీకు మందులు తేవడానికి వెళ్లాడు.''

''ఎవరు?''

''అదిగో వస్తున్నాడు'' అంది లలిత. తల తిప్పి ఆ వచ్చినతన్ని చూడగానే గుండె ఆగినంత పనయింది రాంమోహన్‌కు.

''నువ్వు...నువ్వు'' అనడం తప్ప ఇంకేమీ అడగలేకపోతున్నాడు.

''ఏంటి సార్! అలా పరుగెత్తుకొచ్చి విరుచుకుపడిపోయారు?'' అని అడిగాడా వ్యక్తి.

''అది సరేగానీ నువ్వెవరు?''


''నా పేరు దయానిధి. ఆ పక్కింట్లో నా స్నేహితుడు కొత్తగా అద్దెకు దిగాడు. ఇవాళ ఆదివారం కదా. మధ్యాహ్నం కచ్చితంగా మూడుగంటలకు రమ్మన్నాడు. నేను అతనితో చిన్న పని వుండి కలవాలని వచ్చాను. చాలా ముఖ్యమైన పని. చాలా దూరం నుండి వచ్చాను. తొందరగా వెళ్లిపోవాలి కూడా. ఆలస్యం అయితే ట్రైన్ మిస్సవుతుంది. ఎంతో కష్టపడి ఇంత దూరం వస్తే నా మిత్రుడు ఇంట్లో లేడు. ఇంటికి తాళం వేసి వుంది. కిటికీలో చిన్న ఉత్తరం వుంది'' అంటూ ఆ ఉత్తరం బయటికి తీసి చూపిస్తూ.

''ఇదే ఆ ఉత్తరం. తను ఏదో అర్జంటు పనిమీద బయటకు వెళ్తున్నాననీ, ఇరవై నిముషాలు వెయిట్ చేయమని వుంది అందులో. సరిగ్గా ఐదు గంటలకి నేను వెళ్లాల్సిన ట్రైన్ వుంది. ఇక్కడ నుండి స్టేషన్‌కి వెళ్లడానికి నలభై నిముషాలు పడుతుంది. నా మిత్రుడు ఎప్పుడు వస్తాడా ఎప్పుడు వెళ్లిపోవాలా అనే టెన్షన్‌తో ఏమీ తోచక అటూ ఇటూ తిరగసాగాను. అంతలో మీరు సడెన్‌గా పరుగెత్తుకుని రావడం, పడిపోవడం చూసాను.''

''సరే సరే... మరి మా ఇంటి ముందు పదే పదే తిరుగుతూ కనిపించావు మా ఇంట్లోకి చూస్తూ?''

అతను నవ్వాడు.

''ఓ అదా? మీ ఇంట్లో ఇదిగో ఈ గోడపై వుందే ఈ గడియారంలో టైమ్ చూస్తూ అటూ ఇటూ తిరిగాను. నా చేతికి వాచీలేదు. చుట్టుపక్కల మనిషన్నవాడే లేడు మరి. పదే పదే మిమ్మల్ని అడగడం బావుండదు కదా! అందులోనూ ఈ గడియారంలోని టైమ్ అంత స్పష్టంగా కనిపించడంలేదు కూడా!''



రాంమోహన్ గట్టిగా ఊపిరి పీల్చి వదిలాడు. ఇదన్న మాట అసలు సంగతి. ఈ చిన్న విషయానికి ఎంత హడలి చచ్చాడు తను?

''ఏయ్ దయానిధి! రా...రా...సారీరా! లేటయింది. నువ్వు వెళ్లిపోయావనుకుంటూ వస్తున్నాను. మొత్తానికి లక్కీగా నువ్వు వున్నావు. అవునుగానీ ఇక్కడున్నావేంటి?'' బయట నుండి పిలుస్తున్నాడు దయానిధి మిత్రుడు.

''వెళ్తానండీ..జాగ్రత్తగా మందులు వాడండి'' అంటూ మిగిలిన చిల్లరని లలితకి ఇచ్చేసి తన మిత్రునితో కలసి వెళ్లిపోయాడు దయానిధి.

అతనికి థాంక్స్ చెబుతూ భర్తవైపు తిరిగి ''ఇంతకూ ఏం జరిగింది?'' అని అడిగింది రాంమోహన్‌ను లలిత.

''అంతా కాలమహిమ!'' అన్నాడు రాంమోహన్.

★